
నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939

సంపుటి :12 సంచిక :315 రంగారెడ్డి | మంగళవారం 10 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00
Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada



## గల్ఫ్ లోని కోటి మంది భారతీయుల

# భద్రతకు ప్రాధాన్యం

## వార్ జోన్ నుంచి 67వేల మందిని తరలించాం

**ప్రస్తుతం రోజూ 50 విమానాలు నడుపుతున్నం**

- భారతీయులు ఇరాన్ వెళ్లొద్దని జనవరిలోనే చెప్పాం
- యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలి.. దౌత్యంతోనే పరిష్కారం
- ఇంధన భద్రతపై కేంద్రం అప్రమత్తం
- ఉభయ సభల్లో విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్

ఢిల్లీ, మార్చి 09 నిర్భయవార్త : గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యం ఇస్తున్నదని దేశాంగ మంత్రి ఎస్ జై శంకర్ చెప్పారు. ఇవాళ పార్లమెంటు ఉభయ సభల్లో ఆయన మాట్లాడారు. పశ్చి మాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆయన స్టేట్ మెంట్ ఇచ్చారు. ఉద్రిక్తతలు తగ్గించి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం కావాలని ఆకాం క్షించారు. పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిణామాలను సమీపంగా గమనిస్తున్నారని తెలిపారు. ప్రధాని అధ్య క్షతన జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూ రిటీ సమావేశంలోనూ అక్కడ ఉన్న భార తీయుల భద్రతపై చర్చించినట్లు వెల్లడిం చారు. పశ్చిమాసియా ప్రాంతం భారత్కు ఇంధన భద్రత, వాణిజ్య పరంగా కీలకమని జైశంకర్ చెప్పారు. గల్ఫ్ దేశాలతో భారత్కు ఏటా దాదాపు 200 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోందని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలు, ఇరాన్లో కలిపి సుమారు ఒక కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని తెలిపారు. యుద్ధ పరిస్థితుల్లో అక్కడ చిక్కుకున్న భారతీయులను తిరిగి తీ సుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటివరకు 67 వేల మందిని సురక్షితంగా తరలించినట్లు తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు ప్రత్యేక విమానాలు ఏర్పా చేసినట్లు, ప్రస్తుతం రోజుకు దాదాపు 50 విమానాలు నడుస్తున్నట్లు చెప్పారు.

**ఇరాన్ వెళ్లొద్దని జనవరిలోనే చెప్పాం**

ఇరాన్ కు వెళ్లవద్దని జనవరిలోనే భారతీయులకు సూచించినట్లు జైశంకర్ గుర్తుచేశారు. ప్రస్తుతం అక్కడ ఉన్న -భారతీయుల భద్రతకు భారత రాయబార కార్యాలయం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పరిస్థితులు చక్కబడిన వెంటనే టెహ్రాన్లోని భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాల కు తరలించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ సరఫరా చైన్ దెబ్బతినే ప్రమాదం ఉందని, పెట్రోలు, గ్యాస్ సరఫరాలపై ప్రభుత్వం నిశితంగా నిఘా పెట్టిందన్నారు. ఇంధన భద్రతకు, భారత కంపెనీల కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. శాంతి స్థాపన కోసం భారత్ తన వంతు దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తోందని, అంతర్జాతీయ మానవతా చట్టాలను ప్రతి దేశం గౌరవించాల జైశంకర్ పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో మానవతా సహాయం కూడా అందిస్తున్నామని, ఇటీవల ఇరాన్కు చెందిన ఓ నౌకను డాకింగ్ చేసేందుకు భారత్ సహకరించినట్లు తెలిపారు.

# రైతుల సొమ్ముతో రాహుల్ బంధు పథకం...

- రైతుబంధు నిధులను రాహుల్ బంధుకు పంపుతున్నారు..
- నాలుగు సార్లు రైతుబంధును ఎగ్గొట్టిన కాంగ్రెస్..
- సీఎం సీటును కాపాడుకోవడంపైనే రేవంత్ దృష్టి
- ఆరు గ్యారెంటీల అమలు చట్టబద్ధతకు ప్రభుత్వంపై ఒత్తిడి..
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సిరిసిల్ల, మార్చి 09 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ బంధు అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. సోమవారం సిరిసిల్లలో జరిగిన నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ రాహుల్ బంధు పథకాన్ని రైతులకు ఇచ్చే రైతు బంధు నిధులతో మొదలు పెట్టాడని, ఏడాదికి వెయ్యి కోట్ల రూపాయలు రాహుల్ గాంధీకి ఇచ్చే రాహుల్ బంధు పథకం మాత్రం తెలంగాణలో పక్కగా రేవంత్ రెడ్డి అమలు చె స్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి ఎప్పుడు ఇబ్బంది వచ్చినా వేల కోట్ల రూపాయలు పంపించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని, అందుకే రాహుల్ గాంధీ కోసం బ్రహ్మాండమైన కొత్త పథకాన్ని తెలంగాణలో తెచ్చారన్నారు. రాష్ట్రంలోని రైతన్నలంతా తమకు రైతు బంధు వస్తుందని, కాంగ్రెస్ పార్టీ పెంచి ఇస్తామన్న నిధులను ఇస్తుందని ఎదురు చూస్తూ ఉంటే.. రేవంత్ రెడ్డి రైతు బంధును ఎగగొడుతున్నాడన్నారు. ఇప్పటికే మూడుసార్లు రైతు బంధును ఎగగొట్టిన రేవంత్ రెడ్డి, ఈసారి కూడా రైతు బంధును ఎగగొట్టాడని మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధును పక్కన పెట్టి రాహుల్ బంధు పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీటును కాపాడుకుంటు న్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి తన సీఎం పీఠం కాపాడుకోవడానికి ఎప్పటికప్పుడు రాహుల్ గాంధీకి, ఆయన కుటుంబానికి అడ్డగోలుగా డబ్బులు పంపుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి సామంత రాజులా రాహుల్ గాంధీ ఢిల్లీ గద్దెకు కప్పం కడుతూ ఉన్నారన్నారు. రాహుల్కు చెల్లించాల్సిన కప్పం గురించి పేదల భూములు గుంజుకొని, పేదల ఇల్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే హైదరాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం దాకా అన్ని చోట్ల 7 ఎదల ఇళ్లను కూలగొట్టి మరి వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తున్నారన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోపాటు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి ప్రతి ఒక్కరూ తెలంగాణకు వచ్చి 100 రోజుల్లోనే తాము ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అందుకే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను మొదటి క్యాబినెట్లో నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పించి.. అమలు చేస్తామని రాహుల్ గాంధీతో సహా అందరూ చెప్పిన మాటలను గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలకు బాకీ పడిన ఆరు గ్యారంటీల చట్టం ఈ సమావేశాల్లో ప్రస్తావిస్తామని, ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును తీసుకువచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు.



## ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోండి

- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

**ఢిల్లీ:** సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుపై కీలక సూచనలు చేశారు. సెకండ్ ఫేజ్‌లో భాగంగా ఎన్టీపీసీ రామగుండంలో ఏర్పాటు చేయనున్న 3X800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకోవాలని సూచించారు. పూర్తి 5X800 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో ఎన్టీపీసీకి తగిన స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. మొదటి ఫేజ్‌లో లాగే సెకండ్ ఫేజ్‌లోనూ ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85% రాష్ట్రానికి మాత్రమే సరఫరా చేయనుందని తెలిపారు. రానున్న రోజుల్లో పవర్ డిమాండ్ మరింతగా పెరగనున్న ఈ నేపథ్యంలో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అతి తక్కువ ఖర్చుతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో ఎన్టీపీసీకి దేశంలోనే విశేషమైన అనుభవం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## రైతుల రుణాలపై కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 09 నిర్భయవార్త : దేశవ్యాప్తంగా రైతులకు వ్యవసాయ రుణాలు కింద మొత్తం రూ. 31,34,807 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సోమవారం లోక్‌సభలో డీఎంకే సభ్యుడు రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. పంట రుణాలు కింద రూ. 16,34,219 కోట్లు.. టర్మ్ లోన్స్ కింద రూ. 15,00,588 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే పలు రాష్ట్రాల రైతుల అప్పుల భారాన్ని ఈ సందర్భంగా గణాంకాలతో సహా వెల్లడించారు. ఈ జాబితాలో తమిళనాడు అగ్రస్థానంలో నిలవగా.. తెలుగు రాష్ట్రాలు ఏపీ రెండు, తెలంగాణ ఏడో స్థానాల్లో ఉన్నాయి.

## నాణ్యతలేని మందులపై ప్రభుత్వం కఠిన చర్యలు..

హైదరాబాద్, మార్చి 09 నిర్భయవార్త ప్రతినిధి : నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు.

**మెడికల్ షాపులకు తక్షణ సమాచారం..**

రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి.

**ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యం..**

ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది.

### లిక్కర్ స్కామ్ కేసులో ట్విస్ట్

# కవిత సహా 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!




ఢిల్లీ, మార్చి 09 నిర్భయవార్త ప్రతినిధి : సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీబీఐ కేసులో ప్రతివాదుల నుంచి సమాధానాలు కోరింది. ఈ కేసులో నిందితులకు రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సీబీఐ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఈ పిటిషన్‌పై ఇవాళ ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రతివాదుల తరఫున న్యాయవాదులెవరూ హాజరు కాలేదు. దర్యాప్తు సంస్థపై తీర్పులోప్రత్యేక కోర్టు వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈడీ కేసు విచారణ వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచిస్తూ తదుపరి విచారణ వచ్చే సోమవారం తదుపరి విచారణ చేపట్టనుంది.

నిర్భయవార్త

సంపాదకీయం

మంగళవారం 10, మార్చి 2026

# తర్జుమాలే ఉద్యమంగా!

పదిహేడేళ్ళ కుర్రాడు. చేతిలో చిన్న పుస్తకం. మైదానం. "లేచిపోయినానని ఎవరన్నా అంటే నా మనసుకెంతో కష్టంగా వుంటుంది". తొలి వాక్యమే కలవరపరచింది. నవల చదవడం పూర్తయింది. కకావికలైపోయాడా కుర్రాడు. ఎవడీ చలం? కష్టపడి ఇరవై రూపాయలు సంపాదించాడు. టికెట్ 16 రూపాయలు. మద్రాసు రైలెక్కాడు. వెతుక్కుంటూ తిరువణ్ణామలై చేరుకున్నాడు. కుర్చీలో కూర్చుని వున్నాడు గుడిపాటి వెంకటచలం. చిరునవ్వుతో పలకరింపు. నర్తకి, ఆ అపరిచితుడికి టవల్ యిచ్చి, స్నానం చేసి రండి అంది. పొద్దున మిగిలిన మూడు ఇడ్లీలూ పెట్టింది. నాలుగైదు రోజులు అక్కడే, చలం సమక్షంలోనే వుండిపోయాడు. తిరిగి వెళ్ళడానికి డబ్బుల్లేవు. చలమే తిప్పలు పడి టికెట్ డబ్బులు యిచ్చి పంపించాడు. హైదరాబాద్ వచ్చి 'శశిరేఖ', 'జీవితాదర్శం', 'అరుణ', 'హంపీకన్యలు'... వరసబెట్టి చదివాడు. ముక్తవరం పార్థసారథి పుట్టాడు. జీవితాదర్శం అంటే శాంతి అని 65 సంవత్సరాల క్రితమే డిస్కవర్ చేశాడు. చదువు వినా మరో మార్గం లేదనీ తెలుసుకున్నాడు. చలం 'యోగ్యతాపత్రం' పరిచిన వెలుతురు దారిలో నడక మొదలెట్టాడు. చలం తన చేతికి యిచ్చిన 'గీతాంజలి'ని శ్రద్ధగా చదువుకున్నాడు. గురుదేవుని నుంచి గురజాడ దాకా ప్రయాణం -- ఒక ఉద్వేగంతో మొదలయింది. కన్యాశుల్కం నుంచి కారల్ మార్క్స్ దాకా కాలి నడక. టాల్‌స్టాయ్ 'ఆనా కెరినినా' ఒక కుదుపు కుదిపింది. సెర్వాంటిస్ 'డాన్ కిహోటే' అల్లకల్లోలం చేసింది. చెహోవ్ పిలిచాడు. గోగోల్ కన్నీళ్ళతో కబుర్లు చెప్పాడు. అటు ఉత్తేజపరిచిన భారతీయ సాహిత్యం, ఇటు సప్తసముద్రాలూ దాటించిన ఇంగ్లీషు లిటరేచర్ జ్ఞానానికి ద్వారాలను బార్లా తెరిచాయి. రాయాల్సిన సమయం ఆసన్నమైందని చిన్న వయసులోనే తెలిసొచ్చింది. ముక్తవరం పార్థసారథి మొదటి కథ 'స్వయంకృతాపరాధం' 1959లో గోల్కొండ పత్రికలో వచ్చింది. నాటి నుంచి 2020 సంవత్సరం దాకా ఆయన రాస్తూనే వున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగం చేస్తూ, ఇద్దరు కొడుకుల్ని చదివిస్తూ, భార్య వసంతతో కలిసి కుటుంబ బాధ్యత మోస్తూ అరవై సంవత్సరాలు రాస్తూ, అనువాదాలు చేస్తూ వుండడం ఒక అరుదైన ఫీట్. పది నవలలు రాశారు. ఆయన మాగ్నం ఓపస్ 'శూన్యం'. పార్థసారథికి బాగా నచ్చిన నవల కూడా అదే. బతుకులోని వేదననీ, విషాదాన్నీ, కన్నీటినీ, వోటమినీ దిగులు అక్షరాలుగా మన ముందు పరవడంలో స్పెషలిస్టు. ఆయన 'రంగుల వల' నాకు చాలా ఇష్టమైన నవల అన్నారు డాక్టర్ జంపాల చౌదరి. "నా 'రంగుల వల' థీమ్ ఫ్యామిలీ, అన్‌హేపీనెస్... అది నా పర్మినెంట్ థీమ్" అన్నారు ముక్తవరం. చలం అప్పుడెప్పుడో వరవరరావుకి రాసిన వుత్తరంలో, వీలైతే పార్థసారథి అనే కుర్రాణ్ణి కలవరాదూ అని కోరారు. 'శూన్యం' నవలకి రాసిన ముందుమాటలో "పార్థసారథి నాకు చలం యిచ్చిన మిత్రుడు" అన్నారు వరవరరావు. ముక్తవరం చనిపోయారని తెలిశాక, వరవరరావు రాసిన వ్యాసంలో, "ఆయన పుస్తకాల చదువు దాహం, ఆ చదివింది నలుగురికీ చెప్పాలనీ, రాయాలనీ వెంటాడిన తపన, ఆయన దగ్గరికి ఎప్పుడూ పోవాలనే స్నేహాన్ని నిలబెట్టింది," అన్నారు. 'కించిద్విషాదం', 'మనసులోని చలి', 'పర్‌ఫెక్ట్--27', 'నువ్వూ నేనూ చిన్నారావు' ముక్తవరం రాసిన మంచి నవలలు. మానసిక సంఘర్షణ అనే అంతర్లోకపు కల్లోలానికి అక్షరరూపం ఇవ్వడం చేతనైనవాడు. ధూళి ఆకాశానికి ఎగిరినా విలువ పెరగదు. జ్ఞానం లేని యాత్రికుడు రెక్కలు లేని పక్షి అని తొలినాళ్ళలోనే గ్రహించిన పార్థసారథి కథలు 'మిణుగురులు' చదివి తీరాలి. నవలలూ కథలే కాకుండా, ప్రపంచ సాహిత్యంలో బాగా నచ్చిన వాటినీ, అందరూ చదవాల్సిన వాటినీ తెలుగులోకి తెచ్చారు ఒక కఠోరమైన క్రమశిక్షణతో! అంతర్జాతీయ రచనల్లో అత్యుత్తమ కథగా తరతరాల పాఠకుల ప్రశంసలు అందుకున్న టాల్‌స్టాయ్ 'డెత్ ఆఫ్ ఇవాన్ ఇలిచ్'ని 'మరణోపనిషత్' పేరుతో తర్జుమా చేశారు. 'వార్ అండ్ పీస్' కంటే 'ఆనా కెరినినా' అంటే ఆయనకి ప్రేమ. "రచయితలందరూ నోబెల్ ప్రైజ్ అందుకోవడమే ఒక శిఖరారోహణ అనుకుంటారు. నోబెల్ ప్రైజ్ అందుకోలేనంత మహానుభావుడు టాల్‌స్టాయ్," అన్నారు ముక్తవరం. మన చిటికెన వేలు పట్టుకుని సాహిత్య లోకవిహారానికి తీసుకువెళ్ళే కరుణ నిండిన తండ్రి ముక్తవరం పార్థసారథి. సూటిగా, గుచ్చుకునేలా మాట్లాడతాడు. మనల్ని షాక్ చెయ్యడానికో, ఎంటర్‌టైన్ చెయ్యడానికో నవ్వించడానికో ప్రయత్నించడు అసలు. ఒక పూట గనక ఆయనతో గడిపితే, మనం ఇంకా పెరటి బావిలోనే వున్నామనీ, ఒక మహాసముద్రాన్ని మిస్సయ్యామనీ ఇట్టే తెలిసొస్తుంది. అయ్యో, ముక్తవరం పార్థసారథి చనిపోయారా! అని మనం ఆశ్చర్యపోనవసరం లేదు. దిగులూ పడనక్కర లేదు. ప్రపంచ సాహిత్యాన్ని కాకపోయినా, కనీసం ముక్తవరం రచనలు, అనువాదాలూ కూడా చదువుకోలేదే అని దిగులుపడాలి. ఆయన రాసిన మొత్తం 69 పుస్తకాలూ అందుబాటులో వున్నాయి. హెచ్.బి.టి., పీకాక్, ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవతెలంగాణ, నవచేతన, మైత్రి, విరసం, నవోదయ... అందరూ పార్థసారథి పుస్తకాలు పబ్లిష్ చేశారు. మెరికా అవతరణ కోసం మూలవాసులైన రెడ్ ఇండియన్లను క్రూరంగా హతమార్చిన మహామానవ విషాదాన్ని డీ బ్రౌన్ 'బరీ మై హార్ట్ ఎట్ వూండెడ్ నీ' అని రక్తాక్షరాలతో రాస్తే, 'నరహంతలు ధరాధిపతులై' అని ముక్తవరం అనువదించారు. ప్రసిద్ధి చెందిన జాక్ లండన్ 'ఐరన్ హీల్'ని 'ఉక్కు పాదం' అని తర్జుమా చేశారు. జాక్ లండన్‌దే 'వైట్ ఫాంగ్', టాల్‌స్టాయ్ 'హాజీ మురాద్', ఇసబెల్లా అలెండీ 'డాటర్ ఆఫ్ ఫార్ప్యూన్', రిచర్డ్ బాక్ 'సీగల్', చెహోవ్, గోగోల్ కథల్ని సరళ సుందరమైన తెలుగు వాక్యంతో మనకి అందించారు. 35మంది నోబెల్ బహుమతి గ్రహీతల కథలతో, వాళ్ళ పరిచయాలతో ఆయన రాసిన 'నోబెల్ తారలు' అమూల్యమైన కాంట్రిబ్యూషన్‌గా నిలిచిపోతుంది. మూడు భాగాల 'నవలా లోకం'లో ప్రపంచ ప్రసిద్ధ నవలల్ని పరిచయం చేశారు. షేక్స్పియర్ కథలు, విశ్వకథా శతకం, 'పగిలిన అద్దం' లాంటివి చదివితే, ఒక జ్ఞాన సముద్రాన్ని యీదినట్టే! ఒక నిజాన్ని కొంచెం మొరటుగా చెప్పుకోవాలంటే, గుడిపాటి వెంకట చలం -- కార్ల్ మార్క్స్‌కి పుట్టిన అక్రమ సంతానంలో అగ్రజుడు ముక్తవరం పార్థసారథి. వామపక్ష భావజాలంతో ప్రభావితుడైన ఈ మంచి రచయిత కారల్ మార్క్స్ రచనల్ని లోతుగా అధ్యయనం చేశాడు. విషాదభరితమైన మార్క్స్ వ్యక్తిగత జీవితం, సౌందర్యరాశి అయిన భార్య జెన్నీ వాన్ వెస్టఫాలెన్‌తో కష్టాల కొలిమిలో కలిసి నడిచిన-- ఇంతవరకూ పాఠకులకు తెలియని-- కుటుంబ జీవితాన్ని 'హశీజవ ఖఅఎ ఝుజూఝుశ్రీ' పేరుతో మేరీ గాబ్రియెల్ రాశారు. దానిని 'ప్రేమ -- పెట్టుబడి: కార్ల్, జెన్నీ మార్క్స్ విప్లవం చిగురించిన వేళ' అని శ్రమకోర్చి ముక్తవరం అనువదించారు.

# మహిళా రైతులకు సమాన హక్కులు, సమ న్యాయం



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాన హక్కులు, సమ న్యాయం అందించాలని, వాటిని అనుభవించే పరిస్థితులు కల్పించాలని ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, యువతులు డిమాండ్ చేస్తున్నారు. అందునా ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా పరిగణిస్తు న్నారు. కుటు ంబం లో ఆడపిల్లలకు వారసత్వ ఆస్తి హక్కు సహా చట్టపరంగా కల్పించిన అనేక హక్కులు క్షేత్ర స్థాయిలో ఇంకా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, భూములు ఈనాటికీ అధికారికంగా ఇంట్లో మగవాళ్ల పేరిట రిజిష్టరయి ఉన్నాయి. సామాజిక కట్టుబాట్లు, పురుషాధిపత్య వారసత్వ భావనలు, అధికార యంత్రాంగం కల్పించే ఆటంకాలతో పాటుగా చట్టపరంగా సంక్రమించిన హక్కుల పట్ల మహిళలలో కనీస అవగాహన లోపించడం మూలంగా భూమి దస్తావేజులలో మహిళలకు స్థానం దక్కడం లేదు. భూమికి యజమానురాలు కానప్పటికీ వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోళ్ల నుంచి కూలీలను పెట్టుకోవడం వరకూ మహిళలే దగ్గరుండి చూసుకుంటున్నారు. భూమి పట్టా మహిళా రైతుల పేరున లేకపోవడం మూలంగా అసలు ఆమె రైతు గుర్తింపునకే నోచుకోవడం లేదు. ఈ కారణంగానే సంస్థాగత రుణాలు, పంటల బీమా, నీటి పారుదల పథకాలు, ఇతర వ్యవసాయ అనుబంధ సేవలు, పర్యావరణహిత సాంకేతిక సదుపాయాలు ఇవేవీ మహిళా రైతులకు అందుబాటులోకి రావడం లేదు. ఈ పథకాలు, సేవలు అన్నింటికీ భూమి మీద యజమాన్య హక్కు కలిగి ఉండడం కనీస అర్హతగా మారడంతో మహిళా రైతులను పథకం ప్రకారమే వెలివేసినట్లయ్యింది. వ్యవసాయ భూముల మీద మహిళలకు హక్కు, నియంత్రణలు కల్పించడానికి సామాజిక వరమైన, సాంస్కృతికపరమైన, న్యాయ పరమైన ఆటంకాలు ఎదురవుతున్నాయి. వ్యవసాయానికి మహిళలు ఇచ్చే తోడ్పాటుకు, వాళ్లు పడే శ్రమకు గుర్తింపే లేకుండా పోయింది. ఆహార వ్యవసాయ ఉత్పత్తులను పండించడంలో మహిళలు పడుతున్న శ్రమకి తగిన గుర్తింపు లభించడంలేదు. దీంతో మహిళలను 'రైతు'గా కూడా పరిగణించడం లేదు. వ్యవస్థాగతంగా మహిళలను వెలివెయ్యడానికి సంస్థాగతంగా ఉన్న ఈ వివక్షను, అన్యాయాన్ని సరిదిద్దాలి. మహిళా వ్యవసాయానికి రక్షణ కరువు పనుల కోసం ఇంట్లో మగవాళ్లు వలసలు పోవడం నానాటికీ పెరుగుతున్నది. ఈ కారణంగా ఇంటిల్లిపాదికి తిండి సమకూర్చటం కోసం కష్టనష్టాలన్నీ భరిస్తూ మహిళలు వ్యవసాయం చేపట్టాల్సి రావడమనేది మరింతగా పెరుగుతోంది. వ్యవసాయంలో మహిళల పాత్ర విస్తరిస్తుండడం మూలంగా వాళ్లలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించే అవకాశాలు పెరిగాయని సూత్రీకరిస్తున్నాను. కానీ క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నమైన పరిణామాలు కనబడుతున్నాయి. వ్యవసాయ పనుల భారం, మొరటు శారీరక శ్రమ తగ్గించే సాంకేతిక సాధనాలు అందుబాటులో లేకపోవడం మహిళల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యాల మీద అలవిగాని ఒత్తిడి తెచ్చిపెడుతున్నాయి. సీజన్‌లో వ్యవసాయ పనులు పూర్తి చెయ్యడానికి తగినన్ని వనరులు లేని పేద మహిళా రైతులు పనుల భారం మూలంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మన దేశంలో మహిళలు, ఆడపిల్లల్లో పౌష్టికాహార లోపం మాత్రం ఆమోద యోగ్యం కానంత పెచ్చు స్థాయిలో నెలకొని ఉన్నది. యుక్త వయసు వచ్చిన పిల్లల్లో మాంసకృత్తుల లోపంతో పాటు రక్తహీనత కూడా అత్యధికంగా ఉండడం నిశ్శబ్ద అత్యయిక పరిస్థితికి అద్దం పడుతున్నది. మహిళలలో నెలకొని ఉన్న పౌష్టికాహార లోపం కొన్ని తరాల పాటు ప్రభావం చూపిస్తుంది. మాతృమూర్తిలో పౌష్టికాహార లోపం, రక్తహీనతల మూలంగా పుట్టే బిడ్డ బరువు తక్కువగా ఉండడం, ఆరోగ్యకరమైన ఎదుగుదల లేకపోవడం ఎదిగే వయసులో ఉన్న పిల్లల పాలిట శాపంగా పరిణమిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలలో చిరుధాన్యాల ఆహారమే తప్ప... తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు మాంసకృత్తుల లభ్యత చాలా అరుదుగా ఉంటుంది. మహిళలకు, వారి బిడ్డలకు పోషకాహారం లభించడం లేదు. గత పదేళ్లుగా మన దేశంలో జాతీయ ఆహార భద్రతా చట్టం కింద పనికి ఆహార పథకం అమలవుతూ వస్తుంది. చౌకధరలకు తృణధాన్యాలు అందించడం, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, యుక్త వయసులో ఉన్న ఆడ పిల్లలకు పోషకాహారాన్ని అందించాలని చట్టం చెబుతుంది. కొన్ని రాష్ట్రాలు పప్పుధాన్యాలు అందిస్తున్నాయి. అయినప్పటికీ మహిళలలో రక్తహీనత, పోషకాహార లోపం ఆందోళనకర స్థాయిలో కొనసాగుతూనే ఉన్నది. ముంగిట నిలిచిపోయిన హక్కులుచట్టాని కి, క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాలంటే లింగ ఆధారిత దృక్పథాన్ని అలవరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. వ్యవస్థాగతంగా నెలకొని ఉన్న అసమానతలను తొలగించడం ద్వారా మాత్రమే మహిళలకు వ్యవసాయ ఆహార రంగాలలో ఎదురవుతున్న చిక్కులు పరిష్కారమవుతాయి. మహిళలకు భూయజమాన్య హక్కు కల్పించడం, తద్వారా వ్యవసాయ సాధనాలకు, శ్రమను తగ్గించే సాంకేతిక సదుపాయాలకు, పరపతి సౌకర్యం పొందడానికి, వ్యవసాయ రంగ సేవలు అందించడానికి వీలు కల్పించి వారికి సాధికారత సమకూరేలా చూడాలి. వ్యవసాయం, ఆహార భద్రత రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి. మహిళలకు బలవర్థక ఆహారం, ఆరోగ్యం, సమత్వం అందించడం పట్ల శ్రద్ధ వహించాలి. ఆహార వ్యవసాయ ఉత్పత్తుల రంగంలో సాగు, సేకరణ, వినిమయం, వాణిజ్య విభాగాలలో మహిళలకు నియంత్రణ కల్పించాలని ప్రొ॥యం.యస్. స్వామినాథన్ తరచూ నొక్కి వక్కాణించేవారు. అయితే ఇందుకు తగిన పథకాల రూపకల్పన అరకొరగా వుంది. చౌకధరల దుకాణాల్లో చిరుధాన్యాల పంపిణీదే పై చెయ్యిగా కొనసాగుతుంది. తృణధాన్యాలు, మాంసకృత్తులు అందించడం ఈడికగా ఉంటుంది. మాతా శిశుసంరక్షణ పథకాన్ని అమలు చేసే కార్మికుల మీద పనిభారం ఎక్కువగా ఉండడంతో ఈ పథకంలో నాణ్యత లోపిస్తుంది. కమ్యూనిటీ అక్షరాస్యతా కార్యక్రమం వెనుక పట్టు పడుతుంది. డిజిటలైజ్ చెయ్యడం మూలంగా ఈ పథకాలు కొంతమందికి అందుబాటులోకి లేకుండా పోతున్నాయి. లబ్ధిదారులకు కనీస నైపుణ్యం లేని మూలంగా ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మహిళలు, ప్రత్యేకించి మహిళా రైతులు పథకాల నుండి పూర్తి లబ్ధి పొందలేక పోతున్నారు. కనీసం ఈ 2026 సంవత్సరంలోనైనా ఈ అంశాలను ప్రాధమ్యాలుగా ఎంచుకోవడానికి 'యం.యస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్', 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్' (ప్రపంచ ఆహార పథకం) సంయుక్తంగా నాలుగు తక్షణ ప్రాతిపదికలను ప్రతిపాదించాయి. మొదటిది-చట్టం, విధానాల రూపకల్పన, గణాంకాలలో మహిళా రైతుల ప్రత్యక్ష భాగస్వామ్యం పెంపొందించాలి. ఇది జరగాలంటే...వ్యవసాయ విధానాలు, పథకాలు అన్నింటా రైతు నిర్వచనాన్ని విస్తృత పరచాలి. కేవలం భూయాజమాన్య హక్కు ఆధారంగా మాత్రమే కాకుండా వ్యవసాయ కార్యకలాపాలను చేపట్టిన వారిని కూడా రైతుగా గుర్తించాలి. మహిళలు, కౌలు రైతులు, భూమి లేని వ్యవసాయ కూలీలు, గిరిజనులు, అటవీ ఉత్పత్తులు సేకరించేవారు తదితర వ్యవసాయ సంబంధిత పనుల్లో ఉన్నవారందరినీ రైతులుగా గుర్తించాలి రెండవది-మహిళలకు భూమి హక్కు కల్పించడంతో పాటు నీటి వనరులు, పరపతి సౌకర్యం అందుబాటులోకి వచ్చేలా చూడాలి. ఇందుకోసం వారసత్వ హక్కు కల్పించడం, భూమి భార్యాభర్తలు ఇరువురి పేరిట ఉండేలా చూడడం, ఇల్లు-ఇళ్ళ స్థలాలు, వ్యవసాయ భూములు మహిళల పేరిట రిజిస్టర్ చేయించడానికి ప్రోత్సాహకాలు ప్రకటించడం, ఈ మేరకు రెవిన్యూ యంత్రాంగం చొరవ తీసుకోవడం అవసరం. భూమి, నీటి వనరులను ఉమ్మడిగా నిర్వహించుకోవడం ద్వారా మరింత లబ్ధి పొందేలా మహిళలలో అవగాహన కల్పించాలి. తద్వారా వారిలో సమిష్టి బేరసారాల హక్కు పెంపొందించడడానికి కృషి చెయ్యాలి. పౌష్టికాహారంపై దృష్టిమూడవది-ఆహార పంపిణీ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలను పౌష్టికాహార లక్ష్యాలతో సమన్వయం చెయ్యాలి. పండ్లు, కాయగూరలు, తృణధాన్యాలు పండించడానికి ఇతోధికంగా తొడ్పడేలా వ్యవసాయ ప్రోత్సాహకాలు, ప్రొక్యూర్‌మెంట్ (సేకరణ) విధానాలలో మార్పులు తీసుకురావాలి. ఈ పంటలను చౌకధరల దుకాణాలు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాలు, కమ్యూనిటీ వంటశాలల ద్వారా విరివిగా వినియోగించేలా చూడాలి. మహిళలకు పెరటితోటల పెంపకానికి అవసరమైన విత్తనాలు సరఫరా చేసి స్థానిక అవసరాలకు తగిన కాయగూరలు, పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి. తద్వారా ఆహార అవసరాలు, వినియోగంలో, ఉత్పత్తిలో గణనీయమైన మార్పులు తీసుకురావచ్చు. నాల్గవది-మహిళలకు నూతన సాంకేతిక విధానాలను అందుబాటులోకి తీసుకురావాలి. శ్రమను తగ్గించే సాధనాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పనిగంటలు తగ్గడానికి వెసులుబాటు కల్పించాలి. ఎప్పటికప్పుడు తగిన సమాచారం అందేలా చూడడం, శిక్షణ కల్పించడం, మార్కెట్ మెళుకువలు మహిళలకు బోధపరచడం అవసరం. తద్వారా ఏ పంట వెయ్యాలి, అందుకు అనుసరించాల్సిన పద్ధతులు ఏమిటి? వంటి అంశాలపై వారికి అవగాహన కలుగుతుంది. ఉత్పాదకత పెంపొందించడానికి ఇదే తగిన మార్గం. తగినంత విజ్ఞానాన్ని పొందడంతోపాటు సంస్థాగతమైన తోడ్పాటు కూడా అందితే మహిళలు వ్యవసాయంలో జీవవైవిధ్యం, పర్యావరణహితం, పోషకాహార ఉత్పత్తుల మీద తిరుగులేని పట్టు సాధిస్తారనేది 'స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' గడించిన అనుభవం. ఆహార భద్రత, ఇతర సంక్షేమ పథకాలు మహిళలు కేంద్రంగా రూపొందించి అమలు చేయడం ద్వారా మెరుగైన సామాజిక ఫలితాలు సాధ్యపడ్డాయని 'ప్రపంచ ఆహార పథకం' అనుభవాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా 'సమాన హక్కులు, సమ న్యాయం, కార్యాచరణ' మన నినాదం కావాలి. మహిళా దినోత్సవంఅనేది అలంకారప్రాయంగా మిగలకుండా ఉండాలంటే ప్రతి మహిళ, ప్రతి యువతి ఈ నినాదాన్ని అందిపుచ్చుకోవాలి. మహిళలను రైతులుగా గుర్తించడం, వారికి భూమి మీద, ఉత్పత్తి సాధనాల మీద హక్కు కల్పించడం ద్వారా పౌష్టికాహారం తమ హక్కు అని చాటి చెప్పగలుగుతారు. ఆరోగ్యకరమైన, బలవర్థకమైన, సమత్వంలో కూడిన భారతదేశ నిర్మాణానికి ఈ హక్కుల కల్పన ఎంతగానో తోడ్పడుతుంది.

## ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే



వైరా/ఖమ్మం మార్చి 9 నిర్భయవార్త రిపోర్టర్.: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో పూర్తయిన గృహ ప్రవేశ కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. జూలూరుపాడు మండలం సాయిరాం తండ గ్రామంలో బానోత్ రుక్మి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి పూర్తయిన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులకు ఇందిరమ్మ ఇల్లు విడతల వారీగా దక్కుతాయని రెండో విడుదలో అధికారులు అర్హులను గుర్తించడం జరుగుతాదని తెలిపారు. ఐటీడీఏ ద్వారా అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పేదల సొంతింటి కల సహకారం కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల సొంతింటి కల సహకారం అవుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి అని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమంలో దరువు పాత్ర అభినందనీయం

### టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ





హైదరాబాద్ మార్చి 9 నిర్భయవార్త సిటీ బ్యూరో :తెలంగాణ ఉద్యమం లో ఆత్మబలిదానాలు చేసుకున్న విద్యార్థుల త్యాగాలను ప్రపంచానికి చాటి చెప్పేలా కృషి చేయడమే కాకుండా, పాలకుల కళ్లు తెరిపించడానికి దరువు సాంస్కృతిక వేదిక చేసిన కృషి అభినందనీయమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు. ఈ సంస్థ ఉత్తమ సాహిత్యం, ఆలోచింపజేసే పాటలతో తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిందని ఆయన కొనియాడారు. దరువు సాంస్కృతిక సంస్థ 25యేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఏప్రిల్ లో నిర్వహించనున్న "దరువు జాతర'' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నాడు హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విరాహత్ అలీ మాట్లాడుతూ ఇరవై ఐదేండ్ల క్రితం పోరాటాల గడ్డ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పురుడు పోసుకున్న దరువు సంస్థ, ఉస్మానియా యూనివర్సిటీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో వేలాది మంది విద్యార్థులకు ఉద్యమ చైతన్యాన్ని అందించి, లక్షలాది మంది ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నదని ఆయన అన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దరువు ఎల్లన్న మాట్లాడుతూ దరువు సాంస్కృతిక వేదిక ఏర్పడి 25 ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో 'దరువు జాతర' పేరిట ఏప్రిల్ 20న రవీంద్రభారతిలో భారీ సాంస్కృతిక సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు దరువు అంజన్న మాట్లాడుతూ, ఈ సభకు కళాకారులు , ఉద్యమకారుల తో పాటు పలువురు ప్రముఖులు హాజరువుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో దరువు సంస్థ ప్రతినిధులు దుర్గం భాస్కర్, వరంగల్ రవి, దరువు రమేష్, తిరుమల, అందె క్రిష్ణ, కిందిపాక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళలు విద్యతో ముందుకు సాగితే సమాజం అభివృద్ధి చెందుతుంది: డా.రాధ మను చౌదరి**



మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మహిళలు సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడంతో పాటు సమాజంలో వారికి సమాన గౌరవం, హక్కులు కల్పించాల్సిన అవసరాన్ని చాటి చెప్పే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది వివిధ ఆటపోటీలలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



అనంతరం నిర్వహించిన సభలో జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి చంద్రావతితో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సతీమణి డాక్టర్ రాధ మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. రాధ మను చౌదరి మాట్లాడుతూ, ఒక అమ్మాయి చదువుకుంటే కుటుంబమే కాదు సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ మహిళలు మానసికంగా ధృడంగా ఉండి కష్టపడి పనిచేస్తే పురుషులకంటే ముందే ఏ రంగంలోనైనా విజయాలు సాధించగలరని అన్నారు. ఆడపిల్లల విద్యాభివృద్ధికి మహిళలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయకుమారి, జిల్లా షెడ్యూల్ కాస్ట్ అభివృద్ధి అధికారి వినోద్, డీఆర్డీవో సాంబశివరావు, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి సుగుణాబాయి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజేయలక్ష్మి, మేడ్చల్ డిపో ఏఈ స్నేహలత, టీఎన్జీఓ జనరల్ సెక్రటరీ కురుమూర్తి, జాయింట్ సెక్రటరీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా వ్యవస్థాపకులు, మహిళా సంఘాల ప్రతినిధులను ముఖ్య అతిథులు సన్మానించారు. అలాగే చెస్, క్యారం, లెమన్ అండ్ స్పూన్, స్పీడ్ వాకింగ్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చెయిర్స్ వంటి ఆటపోటీలలో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు.

# దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు పంపిణీ

### ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం పూర్తి సహకారం: జిల్లా కలెక్టర్ మను చౌదరి









అల్వాల్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న ట్రైసైకిళ్లు, వీల్ ఛైర్లను సరైన విధంగా వినియోగించుకొని జీవితంలో ఆర్థికంగా ఎదగాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. వారికి అవసరమైన మార్గనిర్దేశం, సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. సోమవారం అల్వాల్లోని సఖీ సెంటర్లో జిల్లా మహిళా, శిశు వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు 56 ట్రైసైకిళ్లు, 14 వీల్ ఛైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు శారీరకంగా కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ మానసిక ధైర్యంతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని అన్నారు. మానసికంగా ధైర్యంగా ఉంటే అవకలనం అడ్డంకి కాదని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితి కంటే రేపటి రోజున మరింత మెరుగైన స్థితికి చేరుకోవాలనే సంకల్పం ఉండాలని, అలాంటి ఆలోచనలకు కార్యరూపం దాల్చేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకున్నా, స్టార్టప్‌లు స్థాపించాలనుకున్నా లేదా చిన్న దుకాణాలు పెట్టుకోవాలనుకున్నా ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా వారి పిల్లల విద్యాభ్యాసం, కెరీర్ అభివృద్ధికి అవసరమైన కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా వివిధ రంగాల్లో రాణించేలా సహకారం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ఆర్థిక సహాయం కూడా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ విడతలో వీల్ ఛైర్లు, ట్రైసైకిళ్లు అందని అర్హులైన దివ్యాంగులకు తదుపరి విడతలో తప్పకుండా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ ఛైర్లు పంపిణీ చేశారు. అనంతరం సఖీ సెంటర్‌ను పరిశీలించి అక్కడి సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఆర్డీవో ఓం ప్రకాష్, అల్వాల్ తహసీల్దార్ రాములు, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



ఖమ్మం, మార్చి -09 నిర్భయవార్త రిపోర్టర్.: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ప్రజల అర్జీలను స్వీకరించారు.వెలుగుమట్ల భూదాన్ భూములకు చెందిన సిరికొండ కళ్యాణి తన ఇల్లు కూల్చేశారని, తనకు ప్రభుత్వం తరఫున అందించే సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఖమ్మం అర్బన్ మండలంలో సారథి నగర్ కు చెందిన గాలి నాగేశ్వరమ్మ తాము గత 40 సంవత్సరాలుగా నివసిస్తున్న ఇంటిని రోడ్డు విస్తరణలో తొలగించాలని చూస్తున్నారని, తమకు ఆర్థిక సహాయం చేసి, మరోచోట ఇంటిని మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామ సర్పంచ్ కొండూరి పరిశుద్ధ రావు గ్రామంలో రైతులు పండించిన మొక్కజొన్న మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధరపై కొనుగోలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మార్క్ ఫెడ్ అధికారికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం పట్టణానికి చెందిన దళిత వర్గీయులు గత ప్రభుత్వంలో 320 మంది లబ్ధిదారులకు దళిత బంధు నిధులు మంజూరి అయి ఉన్నాయని, వాటిని తమకు మంజూరు చేసి యూనిట్లు ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కు రాస్తు పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో గుర్రపు డెక్కన్ తొలగిస్తున్న దృశ్యాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నాచారం నిర్భయవార్త ప్రతినిధి : నాచారం హెచ్ఎంటి చెరువులో గుర్రపు డెక్క ఎక్కువగా పెరగడం తో నాచారంలో దోమల బెడద ఎక్కువైంది నాచారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి కి నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పరమేశ్వర్ రెడ్డి స్పందించి జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి చెరువులోని గుర్రపుడెక్క తొలగించే మిషన్ తో పనులు ప్రారంభించారు. సమస్య త్వరగా పరిష్కారం కోసం పాటుపడిన పరమేశ్వర్ రెడ్డికి నాచారం డివిజన్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమ భావనగౌడ్, శ్రీకాంత్ గౌడ్, అశ్వధామ రెడ్డి, మహేష్ యాదవ్, ఫాసీనుద్దీన్, గద్ద క్రాంతి తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరం



మార్చి 9 నిర్భయ వార్త ప్రతినిధి. చర్ల, ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండి విద్యార్థుల చదువులకు సహకరించడం సంతోషకరమని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. తేగడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుప్పా వెంకటేశ్వరరావు మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి మహాలక్ష్మి, కుమార్తె స్రవంతి కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆశాలత విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడాను. విద్యార్థి నిలయంకు దాతలు అందచేస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువులకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి నిలయ అధ్యక్షులు తాటి పాపారావు మాట్లాడుతూ సంస్కారంతో కూడిన విద్య ఎంతో అవసరమని అన్నారు. దాతల మనోభావాలను అనుగుణంగా విద్యార్థులు చదివి సంస్థ పేరుప్రతిష్ఠతను నిలపాలన్నారు. స్రవంతి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. ఇదే క్రమ శిక్షణను కొనసాగించి జీవితంలో ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిలయ కమిటీ సభ్యులు, విద్యార్థులు స్వర్గీయ వెంకటేశ్వరరావు కు పూలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కొమరం భీం విద్యార్థి నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, వనవాసీ జిల్లా సహ సంఘటనా మంత్రి గొంది శోభన్‌బాబు, మమతా రాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



మూడుచింతలపల్లి,నిర్భయ వార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధి అనంతారంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. దేవాలయ యాదవ సంఘం కమిటీ ఆహ్వానం మేరకు డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకలో భాగంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మల్లికార్జున స్వామి కృపతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశం,కౌన్సిలర్ ముద్దం పాపిరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి వెంకటరెడ్డి,మాజీ ఎంపిటీసీ ముద్దం అఖిలేష్ రెడ్డి,ముద్దం భానుచందర్ రెడ్డి,పల్లె శ్రీనివాస్ రెడ్డి,మెరుగు గురువారెడ్డి,బుద్ధి ఎల్లం, మెరుగు నారాయణ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సలంద్రీ ఐలేష్ యాదవ్,వైస్ ప్రెసిడెంట్ పెంజర్ల ప్రవీణ్ యాదవ్,సెక్రటరీ సలంద్రీ శ్రీనివాస్ యాదవ్,కమిటీ సభ్యులు మల్లేష్,సత్తయ్య, బాబు,యాదయ్య, నర్సింహులు,స్వామి,శ్రీశైలం, ముత్యాలు,గురువయ్య, వెంకటేష్,బాలయ్య, నిరుగంటి బాబు,కృష్ణ స్వామి తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్.**

సింగరేణి మార్చి 9 నిర్భయవార్త రిపోర్టర్.: కారేపల్లి గ్రామపంచాయతీలో



సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగాయి. గ్రామ పురవీధుల్లో చెత్తా,చెదారం తొలగించారు. ఈ ప్రణాళిక కార్యక్రమంలో సింగరేణి ఎంపీ ఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామ సర్పంచ్ మేదరి టోనీ, కార్యదర్శి నెహ్రు, వార్డు సభ్యులు భాగస్తులై గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరిపై ఉన్నదని తెలిపారు. గ్రామాలలో చెత్తా,చెదారం మురికి కాలువలు పరిశుభ్రత తప్పనిసారని, ప్రతి ఇంటి ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీ ఓ రవీంద్ర ప్రసాద్ తెలిపారు.

# తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 14వ విడత అన్నదానం

**కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ కాంటీన్ ఏర్పాటు చేయాలి**
**టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని విజ్ఞప్తి**





మేడ్చల్ మల్కాజ్గిరి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే రైతు అన్నదాన కార్యక్రమం సోమవారం నాడు. 14 విడత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు ఇంద్రపాల భవాని మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అనేకమంది తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతోమంది బాధితులు వస్తుంటారని ఆమె అన్నారు. అటువంటి వారికోసం ఎంతో కొంత సహాయం అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రైతు అన్నదాన కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గత 14 వారాలుగా ప్రతి సోమవారం క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ పెద్ద మనసుతో స్పందించి కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వారి కోసం ఐదు రూపాయల భోజనం ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం 80 నుండి 100 మంది వరకు అన్నదానం అందిస్తున్నామని భవిష్యత్తులో మరి కొంత ఎక్కువ మందికి అందించేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఈ సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు**



మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి



అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ (ఇంచార్జి) చంద్రావతి కలిసి మొత్తం 99 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హౌజింగ్ శాఖకు సంబంధించి అత్యధికంగా 33 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజలు ఎంతో వ్యయప్రయాసలకు ఒడిగట్టుకుని తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని, దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో కూడా తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థుల నేతృత్వ సమావేశాలు ఉపయోగపడుతాయి



తార్నాక, నిర్భయవార్త ప్రతినిధి: నారాయణ పాఠశాలలో ఘనంగా విద్యార్థుల నేతృత్వం సమావేశాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పీపీ1, పీపీ2 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాల పరమేశ్వరావు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలోనేర్చుకున్నటువంటి పాఠాలు, గేయాలు, నీతి కథలు,రంగులు నేర్చుకొని ఒక రంగుతో ఎన్ని రకాల వస్తువులు, పండ్లు, పూలు, కూరగాయలు మొదలైన వాటి గురించి ఇంగ్లీషులో అనర్గళంగా చెప్పటం ఎంతో ఆనందాన్ని కలిగించిందని వారు తెలిపారు. ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థుల నేతృత్వ సమావేశాలు ఉపయోగపడుతాయని ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి, బాల పరమేశ్వరావులు తెలిపారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ విద్యార్థులు వారి ఉపాధ్యాయులు తయారు చేసినటువంటి బోధనోపకరణాల సహాయంతోపండుగలు వాటి విశిష్టత గురించి వివరించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి.హెడ్. మీనా, ఈ- కిడ్జ్, కో-ఆర్డినేటర్ నూర్, ఈ-కిడ్జ్ షాహీన్, ఈ-చాంప్స్ సరిత, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ పూజ, పిఈటి నరేష్, ఏ ఓ మహేందర్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మూసాపేటలో ఘనంగా ఇఫ్తార్ విందు

**మతసామరస్యంతో పండుగలు జరుపుకోవాలి: బండి రమేష్**





మూసాపేట నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మూసాపేట జనతా నగర్‌లో కాంగ్రెస్ నాయకుడు సలీం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో హిందూ, ముస్లిం సోదరులు తమ తమ పండుగలను మతసామరస్యంతో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, సత్యం శ్రీరంగం, శేరి సతీష్ రెడ్డి, తూము వేణు, సంజీవరావు, గంధం రాజు, తూము మనోజ్ కుమార్, ప్రవీణ్, కృష్ణ రాజ్‌పుత్, సాయిబాబా చౌదరి, పొడుగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామిని దర్శించిన తోటకూర వజ్రేష్ యాదవ్





దుండిగల్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో ఉన్న శ్రీ శ్రీ శ్రీ గొల్ల కెతమ్మ, బలిజ మేడలమ్మ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొల్లాన్ హనుమంత్ రెడ్డితో కలిసి మల్లికార్జున స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ అభివృద్ధి, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్టీవో మెంబర్ జైపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా నాయకులు ఇమ్మడి



సింగరేణి మార్చి 9 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి గ్రామ నివాసి ఆరేల్లి శివ,కావ్య ల రిసెప్షన్ వేడుకలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు పాల్గొని దంపతులను ఆశీర్వదించారు . ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ రాజశేఖర్, పాలిక శ్రీను,తోగర శ్రీను,వెంకీ,ఉపేందర్,వేణు.పాలిక వీరయ్య, ప్రసాద్,నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# కూలికి వెళ్లి తిరిగి రాని లోకానికి వెళ్లిన కూలీలు

## చిన్న నిర్లక్ష్యంతో రోడ్డున పడ్డ రెండు పేద కుటుంబాలు.

మంచిర్యాల బ్యూరో/ దండేపల్లి, మార్చి9, నిర్భయవార్త ప్రతినిధి :మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మేదరిపేటలో చోటుచేసుకున్న విషాద ఘటన రెండు పేద కుటుంబాలను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. పొట్టకూటికోసం ఉదయం కూలికి వెళ్లిన ఇద్దరు కార్మికులు ఇంటి ముఖం కూడా చూడకుండానే విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలచి వేసింది.సోమవారం మేదరిపేట లోని ఇండియన్ పెట్రోలు బంకు వద్ద ఎత్తైన ఇనుప స్టాండ్‌ను తరలించే పనిలో మాదాపూర్‌కు చెందిన చల్ల లక్ష్మీనారాయణ (ఎడ్డన్న) (45), వెల్లనూరుకు చెందిన చందనగిరి నాగరాజు (40) అనే ఇద్దరు కూలీలు పనిచేస్తున్నారు. స్టాండ్‌ను తీసుకెళ్లే సమయంలో అది పైభాగంలో ఉన్న ప్రధాన విద్యుత్ తీగలకు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించి ఇద్దరూ అక్కడికక్కడే కుప్పకూలి పోయారు. తీవ్ర విద్యుత్ షాక్‌కు గురైన వారు ప్రాణాలు కోల్పోయారు.రోజువారీ కూలి చేస్తేనే ఇల్లు గడిచే పరిస్థితుల్లో ఉన్న ఈ ఇద్దరు కుటుంబాల పెద్దలు ఒక్కసారిగా మృతి చెందడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. విషయం తెలుసుకుని ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. “ఉదయం కూలికి వెళ్తున్నాం” అని వెళ్లిన వారు ఇలా శవాలుగా మారడం చూసి గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు.పెట్రోలు బంకు నిర్వాహకుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధిత కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై తహసీనుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పొట్ట నింపుకోవడానికి కూలి పనికి వెళ్లిన ఇద్దరు కూలీలు తిరిగి ఇంటి ముఖం చూడకపోవడం మేదరిపేట గ్రామాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. రెండు పేద కుటుంబాల ఆశలుఒక్క క్షణంలో కూలిపోయాయి.


దండేపల్లి :చందనగిరి నాగరాజు (ఫైల్ ఫోటో )


దండేపల్లి :సల్ల లక్ష్మీ నారాయణ (ఫైల్ ఫోటో )

## ప్రేమ హస్తం ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**చైర్మన్ రెవరెండ్ డాక్టర్ ఎలిజిబెత్ విజయ్ దార్లచే ప్రత్యేకంగా ఏర్పాటు**






ఘట్కేసర్ మార్చ్ 08నిర్భయవార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ పరిధి ఎన్ ఎఫ్ సి నగర్ లోఅంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భముగా మహిళల దినోత్సవం వేడుకలు ట్రస్ట్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ ఎలిజబెత్ విజయ్ దార్ల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఘట్కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొమ్ము గోని రమాదేవి మైపాల్ గౌడ్ బొట్టు అరుణ కృపానిది రిబ్కా సురేష్ శ్యామ్ నాతారి రెవరెండ్ సునీత పాల్ హాజరైనారుఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి వాక్యాన్ని అందించినటువంటి రెవరెండ్ డాక్టర్ ఎం జ్యోతి రాజేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీలు వంటింటికే పరిమితం కాకుండా స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది తల్లి మొదలుకొని చెల్లి భార్య గురువు ఇలా ఎన్నో బాధ్యతలను చేయగలరు ఆమె లోని గొప్పతనం ఏమంటే ఓవైపు ఇంటిని చక్కబెడుతునే మరోవైపు సంఘంలోనూ ఎన్నో రోల్స్ పోషిస్తుంది మగవారికి సమానంగా టీచరు ఇంజనీరు పైలెట్ రాజకీయ రంగంలో తన బాధ్యతలను కూడా స్వీకరించి 100% వాటికి న్యాయం చేస్తుంది నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్ని అంటాయి వీటన్నిటికీ ప్రత్యేకగా ప్రపంచంలోని మహిళల కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ ఎలిజిబెత్ విజయ్ దార్ల చేతుల మీదుగా కొంతమంది స్త్రీలకు మెమొంటోస్ అర్హులైన వారికి సేవా రత్న అవార్డ్స్ సేవా అభ్యుదయ అవార్డ్స్ అందించడం జరిగినది కార్యక్రమానికి చేయూతనిచ్చినటువంటి కార్యసభ్యులు కమిటీ సభ్యులు సిహెచ్ నాగేశ్వరరావు పరిమళ పుష్పమ్మ ప్రకాష్ సిపోరా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం.

**అభివృద్ధి పనుల పరిష్కారానికి కృషి**
**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.**



మంచిర్యాల బ్యూరో, మార్చి 9, నిర్భయవార్త ప్రతినిధి :జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం తో పాటు అభివృద్ధి పనుల అమలులో అధికారులు వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న నీటి ట్యాంకు తదితర పనుల పురోగతిని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, శ్రీనివాస్ రావులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూమి వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, మార్కెట్ దుకాణాల సమస్యలు, బోర్‌వెల్లకు విద్యుత్ లైన్ మంజూరు వంటి వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ నెల 12న సర్పంచ్‌లు, మున్సిపల్ ప్రజాప్రతినిధులకు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే సి.ఎం. కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను పతకాలు, జ్ఞాపికలతో అభినందించారు.

## మహిళ శక్తే ఈనాడు దేశ భవిష్యత్తు డీటీసీ యం. పురేంద్ర



విజయవాడ మార్చ్ 9నిర్భయవార్త ప్రతినిధి : ప్రభు త్వ కార్యాలయల్లో పనిచేస్తున్న మహిళలు ఒక పక్క కుటుంబం రెండో పక్క ఉద్యోగ బాధ్యతలను నెరవేరుస్తూ నేటి సమాజానికి ఆదర్శంగా ఉంటు న్నారని డీటీసీ యం. పురేంద్ర అన్నారు.స్థానిక బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించు కొని మహిళ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన కార్యక్ర మానికి డిటిసి ఎం పురేంద్ర ముఖ్య అతిథులుగా హాజరైనారు.ఈ సందర్భంగా డిటిసి ఎం పురేంద్ర మాట్లాడుతూ మహిళల హక్కులు, మహిళా కార్మి కులకు సమాన వేతనం, మెరుగైన పని పరిస్థితు లు, ఓటు హక్కు మొదలగు వాటిపై ఆనాడు మ హిళలు ఉద్యమాలు చెప్పట్టారని ఆయన అన్నా రు. దాని ఫలితమే ఈనాడు అంతర్జాతీయ మహి ళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపం చవ్యాప్తంగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, సాధికారత మరి యు సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గౌరవిస్తూ ప్రపంచవ్యాప్తంగా మహిళలను గౌరవించడం జరి గిందన్నారు. కుటుంబానికి ఆదారంగా, సమాజా నికి ఆదర్శంగా, దేశ అభివృద్ధికి శక్తిగా మహిళలు నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. మహిళల ను గౌరవించడం మన సమాజ పురోగతని, మహి ళ శక్తే ఈనాడు దేశ భవిష్యత్తని ఆయన అన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులకు సన్మానం చేసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు డిటిసి ఎం పు రేంద్ర తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీవోలు పద్మావతి, ఆర్ ప్రవీణ్, ఎస్ వెంకటేశ్వరరావు, ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం రాజుబాబు, మోటార్ వాహన తనిఖీ అధికారు లు పద్మాకర్, ఉదయ్, అలీ,, గీతాంజలి, ప్రియదర్శి ని,, దివ్య, కార్యాలయ పరిపాలన అధికారులు అ బ్దుల్ సత్తార్, సత్యనారాయణ, లలిత, ఉష సుంద రి, రిటైర్డ్ ఆర్టీఓ రాజారావు, ఉ ద్యోగులు పాల్గొన్నా రు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**








ఉప్పల్, మార్చి9 నిర్భయవార్త ప్రతినిధి : ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మి నారాయణ కాలనీ వాసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కుటుంబం, సమాజం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి రంగంలో మహిళలు ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, ఆకుల మహేందర్,స్థానిక నాయకులు చిన్నారావు, కాలనీ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## ఇబ్రహీంపట్నం మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**పశు వైద్య అధికారి ఆనంద రెడ్డి**



ఇబ్రహీంపట్నం 9 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఇబ్రహీంపట్నం మండలం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఈ నెల 10/03/2026 నుండి 06/04/2026 వరకు నిర్వహించబడుతుంది. పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. దీనివల్ల పశువులకు తీవ్రమైన జ్వరం రావడం, నోటిలో మరియు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనివల్ల పశువుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, పాల దిగుబడి గణనీయంగా తగ్గి పశు పోషకులకు ఆర్థిక నష్టం కలుగుతుంది.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పశువులకు (ఆవులు గేదెలకు) తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ (పశుసంవర్ధక శాఖ) డా వసంత, పశువైద్యాధికారులు డా ఆనందరెడ్డి, డా సరిత కోరారు.

## బొమ్మల రామారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా డి. శ్యామల బాధ్యతలు స్వీకారం



యాదాద్రి భువనగిరి జిల్లా 9 మార్చి నిర్భయవార్త ప్రతినిధి : బొమ్మల రామారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీమతి డి. శ్యామల తాజాగా పదవి బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టగా అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.గతంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసిన వి. రాజా త్రివిక్రమ్ ఫిబ్రవరి నెలాఖరున ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం తాత్కాలిక ఏర్పాటుగా మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డికి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన కొంతకాలం పాటు ఆ బాధ్యతలను నిర్వహించారు.ఇదిలా ఉండగా శ్రీమతి డి. శ్యామల గతంలో హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ సంస్థ లో ఫారెన్ సర్వీస్‌గా విధులు నిర్వహించి, అక్కడి నుండి తమ మాతృ సంస్థ అయిన పంచాయతీ రాజ్ శాఖ కు తిరిగి వచ్చారు. అనంతరం ఆమెను బొమ్మల రామారం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా నియమించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె మండలంలోని గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పంచాయతీ రాజ్ పథకాల సమర్థ అమలు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకారంతో మండల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ఆమె తెలిపారు.

## ఘనంగా శ్రీసరస్వతి శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం





ఉప్పల్, మార్చి9 నిర్భయవార్త ప్రతినిధి :ఉప్పల్లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హోమియోపతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లింగరాజు, సరస్వతి విద్యా పీఠం ప్రాంత సహకార దర్శి అర్థ చంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఉత్తమ విలువలు పెద్దల పట్ల గౌరవం, దేశ సంస్కృతి పట్ల,గౌరవాన్ని పెంపొందించే విధంగా తీర్చిదిదబడుతుందని పేరుకొన్నారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేసిన వేలాది మంది మంచి మార్గంలో పయనిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. పాఠశాల విద్యార్థులచే వివిధ వేషధారణలతో ఎంతో రమణీయంగా దేశభక్తి సంబంధించిన గేయాలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలోనాగప్రశాంతి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుబ్బ లక్ష్మారెడ్డి, గోనె ప్రభాకర్ రెడ్డి, జెట్ట సుధాకర్, పాఠశాల అధ్యక్షులు అంకన్న, మాధవ రెడ్డి, గౌరవ అధ్యక్షులు అంజి రెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, మల్లారెడ్డి, కోశాధికారి ఉపోజి బలవంత చారి పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు






మేడిపల్లి, మార్చి9 నిర్భయవార్త ప్రతినిధి : అంత ర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భం గా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి లో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలు తమ తమ ప్రసంగాన్ని వినిపించారు.తదనంతరం కేక్ కట్ చెసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలకు మెమోంటో అందించి,వచ్చిన ప్రతి మహిళ సోదరీమణులందరిని మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి శాలువతో మర్యాదపూర్వకంగా సన్మానించి గౌరవించుకున్నారు.ఈ కార్యక్రమంలో సంధ్య, రాజేశ్వరి, శోభా, లక్ష్మి, రమాదేవి, లక్ష్మి,భారతి, నళిని, అనూష,రజిత,చందన, సారిక,మల్లేశ్వరి, సరస్వతి మరియు విహారిక,శ్రీ సాయి నగర్,సాయి హిల్స్,క్రాంతి కాలనీల మహిళలు, కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఆదివాసీ భూముల జోలికి వస్తే తిరుగుబాటే: సిపిఎం అనుబంధ సంఘాలు



మంచిర్యాల బ్యూరో/ దండేపల్లి, మార్చి 9, నిర్భయవార్త ప్రతినిధి : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మాకులపేట గ్రామపంచాయతీ పరిధిలోని కోయపోచగూడెం ఆదివాసీలకు అటవీ శాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ భూముల జోలికి వస్తే తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ఆదివాసీలకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిన వెంటనే వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు సోమవారం ఆ గ్రామానికి చేరుకుని ఆదివాసీలతో సమావేశమై పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కోయపోచగూడెం ఆదివాసీలు 2003 సంవత్సరం నుంచి పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి భూములపై హక్కులు రాకుండా చేయడానికి అటవీ శాఖ అధికారులు, గత ప్రభుత్వాలు అనేకసార్లు దమనకాండకు పాల్పడ్డారని ఆరోపించారు. అనేక మంది ఆదివాసీలపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేసిన ఘటనలు ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ తమ భూములను కాపాడుకునేందుకు ఆదివాసీలు దాదాపు 25 సంవత్సరాలుగా పోరాటం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. 2005లో అమలులోకి వచ్చిన అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలకు భూములపై హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఇవ్వలేదని విమర్శించారు. హక్కు పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్న ప్రభుత్వాలు, అటవీ శాఖ అధికారులు ఇప్పుడు భూములు ఖాళీ చేయాలని లేదా భూములకు సంబంధించిన పట్టాలు, హక్కు పత్రాలు చూపించాలని 52 మంది ఆదివాసీలకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని మండిపడ్డారు. అటవీ శాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే తమ భూములను కాపాడుకునేందుకు ఆదివాసీలు మరోసారి పోరాటానికి సిద్ధమవుతారని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొడెంకి చందు, జిల్లా ఉపాధ్యక్షుడు కొండగొర్ల లింగన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అంబటి లక్ష్మణ్, నాయకులు రమేష్, ఎల్లయ్య, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గంధం రాజలింగు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కోయపోచగూడెం ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## "నేటి బలమైన మహిళలే.... రేపటి బలమైన ప్రపంచం"

"మహిళా మూర్తులకు సన్మానం"



పాకాల, మార్చి 9 నిర్భయవార్త ప్రతినిధి :తిరుపతి జిల్లా, పాకాల మండలం, మొగరాల ఉన్నత పాఠశాలలో గడిచిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయురాలు సుమలతను,మహిళా సిబ్బంది నీరజ, విమలా విక్టోరియా, ప్రబోధిని, శైలజ, కవిత, మధ్యాహ్న భోజన సిబ్బంది మెరీనా మరియు ఆయా నాంచారమ్మలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ లింగ సమానత్వం, పునరుత్పత్తి హక్కుల సాధనతో పాటు హింస మరియు వివక్షకు ముగింపు పలికినప్పుడే మహిళలు సామాజిక ,ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలు సాధించగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు, ఆదికేశవులు ,మహ్మద్ సుల్తాన్, బాబు, రామ్మూర్తి, బోధనేతర సిబ్బంది మోహన్ రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలు తగ్గించాలి సీపీఐ నిరసన ధర్నా

తిరువూరు, మార్చి నిర్భయవార్త ప్రతినిధి : పెరిగిన వంట గ్యాస్ ధరలతో సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నారని భారత్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తిరువూరు ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేటు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యదర్శి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వంట గ్యాస్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై అదనపు భారం పడిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడంతో 14.2 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.853 నుంచి రూ.913కు పెరిగిందని తెలిపారు. అంటే ఒక్క సిలిండర్‌పై రూ.60 పెరిగిందన్నారు. అదే విధంగా హోటళ్లు, వ్యాపార సంస్థలు ఉపయోగించే 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,768 ప్రాంతం నుంచి సుమారు రూ.1,883 వరకు పెరిగిందని పేర్కొన్నారు. దీంతో వ్యాపారస్తులపై కూడా భారీ ఆర్థిక భారం పడుతోందన్నారు. గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా ఇప్పటికే పెరిగిన ద్రవ్యోల్బణంతో బాధపడుతున్న సామాన్య కుటుంబాల జీవనం మరింత కష్టమైందన్నారు. హోటళ్లు, చిన్న వ్యాపారాలు నిర్వహించే వారు కూడా గ్యాస్ ధరల పెరుగుదలతో తీవ్ర




ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలను తగ్గించి సామాన్యులకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజలకు భారంగా మారిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ నాయకులు షేక్ నాగుల్ మీరా. మాలపాటి ఉదయ్, ఉన్నం సాంబశివరావు, ఎస్కే సుభాని, అయినాల ముత్తయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, నరసింహారావు, పల్లకి శ్రీను, గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి.

పాకాల మార్చి 9 నిర్భయవార్త ప్రతినిధి :మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్వీ రమేష్ కుమార్ అన్నారు. సోమవారం కళాశాలలో మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మహిళల అభివృద్ధిలో చదువు కీలక పాత్ర వహిస్తుందన్నారు. మహిళా




విభాగం సమన్వయకర్త డాక్టర్ రమణమ్మ విద్యుత్ ద్వారానే మహిళలకు హక్కుల పట్ల అవగాహన, ఆర్థిక స్వేచ్ఛ, ఆత్మగౌరవం పెంపొందుతాయన్నారు. మన సంస్కృతి కళా సంస్థ రెడ్డప్ప మహిళల గొప్పతనాన్ని కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మాశిలామని, చిట్టి కళావతి అధ్యాపకులు మోహనో బెహరా, ఆది శేఖర్ రెడ్డి, ఈశ్వర బాబు, మాధవి, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులు అయిన వేళ..

**కె.వి తండాలో స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు: ప్రధానోపాధ్యాయులు శోభారాణి**



ఇబ్రహీంపట్నం నిర్భయవార్త ప్రతినిధి : మండల కేంద్రంలోని కె.వి తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ అనే కార్యక్రమంలో ఒక్క రోజు విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించడం జరిగింది .స్వయం పరిపాలన దినోత్సవం పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పరిపాలన బాధ్యతలు స్వీకరించి బోధన చేస్తూ ఒకరోజు పాఠశాల నిర్వహణ బాధ్యతలు వేసుకోండి ఒక్క అద్భుతమైన కార్యక్రమమే స్వయం పరిపాలన దినోత్సవం ఇది విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు బాధ్యతలు క్రమశిక్షణలు పెంపొందిస్తుందని ఉపాధ్యాయుల పాత్రలలో సూచిస్తూ తరగతులు నిర్వహిస్తారని నిజమైన ఉపాధ్యాయులు సైతం తరగతి గదిలో వెనక కూర్చుని విద్యార్థుల బోధనలు ఎంత ఆసక్తిగా గమనించడం జరుగుతుంది. ఉదయం నుండి సాయంత్రం వరకు పాఠశాల నిర్వహణ ప్రేయర్ భోజన విరామం తరగతుల నిర్వహణ ఆ విద్యార్థి టీం చూసుకుంటుందని పరిష్కరించడంలో తోటి విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో చెప్పడంలో చూపించిన. చొ రవతో చూసి ప్రధానోపాధ్యాయురాలు అభినందించారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల కష్టాన్ని బాధ్యతలు స్వయంగా అనుభవించి తెలుసుకుంటారని ఈ దినోత్సవం జరుపుకుంటారని ప్రధానోపాధ్యాయులు శోభారాణి తెలిపారు. ఉపాధ్యాయుల కష్టం, బాధ్యతలు ఎంత గొప్పవో అర్థమవుతుంది. ఒక తరగతిని సక్రమంగా నిర్వహించడం, అందరికీ అర్థమయ్యేలా బోధించడం ఎంత కష్టమో విద్యార్థులు గ్రహిస్తారని, విద్యార్థులలో మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ గుణాలు, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయని,విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ" అనే కార్యక్రమం విద్యార్థులకు మంచి అనుభవాన్ని ఇస్తుందని,ఇది ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని పెంచడమే కాకుండా విద్యార్థులలో బాధ్యతా భావాన్ని పెంపొందిస్తుందని,అందువల్ల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని తరచూ నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమని పి ఆర్ టి యు మండల అధ్యక్షులు డాక్టర్ వరకాల పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి,ఉపాధ్యాయులు స్వప్న విష్ణువర్ధన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి (99 ) ఫిర్యాదులు





రంగారెడ్డి జిల్లా 9 నిర్భయవార్త ప్రతినిధి : ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులుఅందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ --19, ఇతర శాఖలకు --80, మొత్తం 99 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సుప్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





ఉప్పల్, మార్చి9 నిర్భయవార్త ప్రతినిధి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లో సుప్ర స్వచ్ఛంద సంస్థ గడ్డం భవాని ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకటరావు పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, మహిళా సాధికారతతోనే సమాజం ముందుకు సాగుతుందని శ్రీవాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్, అంగన్వాడీ టీచర్స్, జిహెచ్ఎంసి వర్కర్స్, డాక్టర్లు మరియు సమైక్య నాయకులు యాదమ్మ, జయమ్మ, రంగమ్మ, నిర్మల, ప్రభావతి తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళల ఆరోగ్యం, విద్య, ఉపాధి మరియు భద్రతపై చర్చలు జరిగాయి. సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయాలని, మహిళల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని గ్రూప్ వన్ ఆఫీసర్ మాధవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సుప్ర స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గడ్డం సాయికిరణ్ మహిళలను సత్కరించి వారి సేవలను అభినందించారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు




మధిర మార్చి 9 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగముగా సోమవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో చైర్ పర్సన్ సామినేని సుజాత పర్యవేక్షణలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. అదేవిధంగా కౌన్సిలర్లు 1వ వార్డులో దోర్నాల శిరీష, 8వ వార్డులో యన్నం కోటేశ్వర రావు, 12వ వార్డులో మోదుగు నాగలక్ష్మి, 22వ వార్డులో దారా నాగార్జున ఆధ్వర్యంలో వార్డుల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ శివ కృష్ణ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ దాడులు..

**లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఎస్సైలు**



హైదరాబాద్ నిర్భయవార్త ప్రతినిధి :సైబర్ క్రైం కేసులో అరెస్టు చేయకుండా ఉండడానికి ఫిర్యాదుదారుడు నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు ఆర్ఎస్సైలు ఏసీబీకి చిక్కారు. మల్కాగిజిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీ నగర్ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌కు చెందిన ఇద్దరు ఎస్సైలు ప్రమోద్ గౌడ్ , జటావత్ బాబు నాయక్ సోమవారం రూ. లక్ష లంచం తీసుకుంటుండంగా పట్టుబడ్డారు. ఎల్బీ నగర్ చౌరస్తాలో ఎస్సై జటావత్ బాబు ఈ డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో దాడుల నిర్వహించి పట్టుకున్నారు. లక్ష రూపాయల నగదును పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా విధుల ఉల్లంఘలకు పాల్పడి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఏసీబీ శాఖ సూచించింది. సోషల్ మీడియా నంబర్ 9440446106 అనే వాట్సప్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించింది.

## పార్టీలకతీతంగా తాండూరు పట్టణ అభివృద్ధి






తాండూర్ ఫిబ్రవరి 9 నిర్భయవార్త ప్రతినిధి : తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి గారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి హాజరైన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమావేశ అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఈ రోజు మున్సిపల్ కార్యాలయంలో మహిళ కౌన్సిలర్ లకు, ఆర్పిలకు, వార్డు ఆఫీసర్లకు, మున్సిపల్ సిబ్బందికి సన్మానించిన ఎమ్మెల్యే ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్లు మరియు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం 'దండి మార్చి 2.0' ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎస్పీ బి.ఉమామహేశ్వర్








బాపట్ల, నిర్భయవార్త ప్రతినిధి : దేశ యువత భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారుతున్న మాదకద్రవ్యాల పట్ల చైతన్యం కలిగించే లక్ష్యంతో, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వంలో "వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్" ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'దండి మార్చి 2.0' కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు సోమవారం తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో మహాత్మా గాంధీ దేశ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించేందుకు చేపట్టిన 'దండి మార్చి' తరహాలోనే, నేడు డ్రగ్స్ అనే మహమ్మారిని అరికట్టడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ దేశాన్ని ముందుకు నడిపించే మహా శక్తి యువతని, ఆ యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసైతే దేశ భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పోలీస్ శాఖకు సహకరిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న 'దండి మార్చి 2.0' కార్యక్రమాన్ని విద్యార్థులు, యువత, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో వేలాది మంది విద్యార్థులతో నిర్వహించే ఈ భారీ ర్యాలీతో పాటు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞా కార్యక్రమం ప్రజల్లో గొప్ప స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యతని, ఇలాంటి సామాజిక చైతన్య కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో బాపట్ల ఈగిల్ సెల్ సిబ్బంది, రోజు ఆర్గనైజేషన్ అధ్యక్షులు పొందుగుల ప్రసాద్, శ్రీ భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, ఎం. జాకబ్, ఆర్.టి.ఐ. ఉపాధ్యక్షులు పి. ప్రసాద్, పలువురు ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యత పెంపొందించుకోవాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల బ్యూరో, మార్చి 9, నిర్భయవార్త ప్రతినిధి :నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యత పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని ఐ టి ఐ ప్రాంగణంలోని ఎ టి సి కేంద్రంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఐ టి ఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ లతో కలిసి ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా పూర్తి విద్యలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్, మందమర్రి, జన్నారం ప్రాంతాలలో ఎ టి సి కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వృత్తి విద్యలో నైపుణ్యత గల వారికి రాష్ట్రంలో, దేశంలోనే కాకుండా విదేశాలలో సైతం ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం జాబ్ మేళాలు నిర్వహించి అర్హత గల వారికి ఉద్యోగాలు అందించడం జరుగుతుందని, వృత్తి విద్య కోర్సులు నేర్చుకునే వారు సర్టిఫికెట్ కోసం కాకుండా నైపుణ్యత కోసం 100 శాతం హాజరు అవ్వాలని తెలిపారు. ప్రజా ప్రయోజనం కోసం ఉత్పత్తి ఉత్పాదకత సరిపడా అందించేందుకు జాబ్ మార్కెట్ లో ఎక్కువ డిమాండ్ ఉన్న కోర్సులను అందించడం జరుగుతుందని, నిరుద్యోగ యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన ఎ టి సి కేంద్రాలలో టాటా సంస్థ వారు ఆర్థిక సహాయాన్ని అందించి విద్యార్థులకు అవసరమైన యంత్రాలు, పరికరాలను సమకూర్చడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు విద్యతో పాటు వృత్తి నైపుణ్యత కలిగి ఉండాలని, షార్ట్ టర్మ్ కోర్సుల ద్వారా తక్కువ సమయంలో నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృత్తి విద్య శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలతో పాటు ఆసక్తి, అర్హత ఉన్నవారికి బ్యాంకు రుణాలు అందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం 600 మంది అభ్యర్థులు వృత్తి విద్య నేర్చుకుంటున్నారని, వీరిలో 80 మంది విద్యార్థినుల కొరకు మూత్రశాలలు, ఇతర సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నూతన భవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవతో హాజీపూర్ మండలం రాపల్లి ప్రాంతంలో 6 కోట్ల రూపాయల వ్యయంతో అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్ అభ్యర్థుల కొరకు కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, ఇందులో 100 మంది అభ్యర్థులకు వసతి కల్పించి 3 నెలల కోర్సు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల ప్రాంతంలో ఐ.టి. పార్క్ మంజూరు అయిందని, పనులు వేగవంతం చేసి స్థానిక నిరుద్యోగ యువతకే కాకుండా బయటి ప్రాంతాల నుండి వచ్చే వారికి సైతం ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుండి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వరకు అభివృద్ధి చెందామని, ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ, మార్పులకు అనుగుణంగా మనల్ని మనం నవీకరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ స్వయంకృషితో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీడబ్ల్యూజేఎఫ్ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదు

### జర్నలిస్టుల పక్షాన పోరాడుతుంది
### త్వరలో భారీగా రాష్ట్ర మహాసభలు
### రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య



హైదరాబాద్, మార్చి 09 నిర్భయవార్త ప్రతినిధి :తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) పట్ల కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులను అయోమయానికి గురి చేయడానికే కొందరు ఈ సంఘం తమదే అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి తప్పుడు ప్రచారాలను జర్నలిస్టులు నమ్మవద్దని కోరారు. సోమవారం హైదరాబాద్ లో నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోలి విజయకుమార్, పలువురు జర్నలిస్టులు టిడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. వీరికి మామిడి సోమయ్య సంఘం సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫెడరేషన్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి గానీ, ఏ ఒక్క మీడియా సంస్థకు గానీ అనుబంధం కాదని స్పష్టం చేశారు. సంఘం వ్యవస్థాపక సభ్యులు అన్ని జిల్లాల్లో పర్యటించి సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొందరు మాజీ నాయకులు సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని జిల్లాల మహాసభలు త్వరితగతిన పూర్తి చేసి త్వరలో రాష్ట్ర మహాసభ భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టుల ప్రధాన సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఉద్యమానికి టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధమవుతుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి, సామాజిక సమానత్వానికి మహనీయుల బోధనలు మార్గదర్శకాలు




నిర్భయవార్త ప్రతినిధి :న్యూఢిల్లీ, మార్చి 09: నేటి ఆధునిక సమాజంలో భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచానికి శాంతి మరియు సామాజిక సమానత్వం అవసరమని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఇటీవల ఇక్కడి ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం లో ఇటీవల విడుదలైన 'సమానత్వానికి ప్రతీకలు: బుద్ధ, గురునానక్ దేవ్ మరియు స్వామి వివేకానంద' అనే పుస్తకంపై ప్రత్యేక చర్చ కార్యక్రమం నిర్వహించారు. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, గౌతమ బుద్ధుడు, గురునానక్ దేవ్ మరియు స్వామి వివేకానందులు వేర్వేరు కాలాల్లో జన్మించినప్పటికీ, వారి లక్ష్యం ఒకటే అని చెప్పారు. అది సామాజిక సమానత్వాన్ని ప్రతిష్టించడం, మానవుల మధ్య ఐక్యతను పెంపొందించడం. ఈ ముగ్గురి బోధనలు భారతీయ సమాజంలో త్రివేణి సంగమం లాంటివి, అంటే భిన్నమైన మార్గాలు కలిసే చోట సమానత్వం సాధించడంలో సహాయపడతాయని ఆయన వివరించారు. ప్రస్తుత ప్రపంచంలో అశాంతి, వివక్షల పరిస్థితులలో వీరి శాంతి సందేశాలు మార్గదర్శకంగా ఉంటాయని చర్చలో పాల్గొన్న మేధావులు అభిప్రాయపడ్డారు. పుస్తకంలోని విషయాలు సామాజిక వివక్షను తొలగించి, ఐక్యతను చాటడంలో పరిశోధకులు, యువతకు గొప్ప స్ఫూర్తిని అందిస్తాయని వక్తలు చెప్పారు. కార్యక్రమంలో ఇగ్నోటా అధ్యక్షులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ గుర్మీత్ కౌర్, జాయింట్ కార్యదర్శి డాక్టర్ కొండే లింగస్వామి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ వీరమల్లు శ్రీశైలం, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ సీమా రాణి, సోషల్ వర్క్ అధ్యాపకులు డాక్టర్ బినోద్ కుమార్, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రవణ్, మరియు 30 మంది పైగా బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థులు వినోద్ హిందుస్తానీ, కత్తుల ఉపేంద్ర పాల్గొన్నారు. ఈ చర్చ ద్వారా బుద్ధ, గురునానక్ దేవ్, స్వామి వివేకానందుల బోధనలు నేటి సమాజంలో శాంతి, సామాజిక సమానత్వం మరియు ఐక్యతను సాధించడంలో మార్గదర్శకంగా ఉంటాయని స్పష్టమైంది.

## ఉపాధి అవకాశాలకు నైపుణ్య శిక్షణ కీలకం: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

మంచిర్యాల బ్యూరో, మార్చి 9,నిర్భయవార్త ప్రతినిధి : నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు పొందేందుకు వృత్తి నైపుణ్య శిక్షణ ఎంతో కీలకమని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. వృత్తి విద్య, స్వల్పకాలిక కోర్సుల ద్వారా యువత తక్కువ సమయంలోనే నైపుణ్యాలను సంపాదించి ఉద్యోగాలు పొందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో నూతన ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్‌లతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. టాటా సంస్థ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు అవసరమైన ఆధునిక యంత్రాలు, పరికరాలను అందుబాటులో ఉంచి శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. వృత్తి విద్యలో నైపుణ్యం సాధించిన వారికి రాష్ట్రం, దేశం మాత్రమే కాకుండా విదేశాలలో కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో సుమారు 600 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని, అందులో 80 మంది విద్యార్థినుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త భవనం నిర్మించేందుకు కూడా చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవతో హాజీపూర్ మండలం రాపల్లి ప్రాంతంలో రూ.6 కోట్ల వ్యయంతో అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్ అభ్యర్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్కడ 100 మందికి వసతి కల్పించి మూడు నెలల శిక్షణ అందిస్తామని వివరించారు. అలాగే మంచిర్యాల ప్రాంతానికి ఐటి పార్క్ మంజూరైనట్లు పేర్కొంటూ, పనులు వేగవంతం చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు.



# సినిమా సిత్రం

## నేహానందం

- రెడ్ అవుట్ ఫిట్‌లో రాధిక
- సరికొత్తగా కనిపిస్తున్న నేహాశెట్టి



డీజే టిల్లు సినిమాలో రాధికా పాత్రతో కుర్రాళ్ల గుండెల్లో గుణపాలు దింపిన నేహా శెట్టి అందం , అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.. ఈ ఒక్క సినిమాతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇకపోతే ఈ ఒక్క సినిమా ఈమెను రాధికగా మార్చేసిందనే చెప్పాలి. బయట ఎక్కడ కనిపించినా సరే టిల్లు రాధిక అని పిలుస్తున్నారే తప్ప నేహా శెట్టి అని పిలిచేవారు చాలా తక్కువ అని చెప్పవచ్చు. ఇకపోతే ఈ మధ్య సోషల్ మీడియాలో మళ్లీ దర్శనం ఇచ్చిన నేహా శెట్టి.. తాజాగా రెడ్ అవుట్ ఫిట్ లో అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసే ప్రయత్నం చేసింది. తాజాగా రెడ్ అవుట్ ఫిట్ లో అందాలు ఆరబోస్తూ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. నేహా శెట్టి షేర్ చేసిన ఈ ఫోటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని చెప్పవచ్చు. ఇక ఉమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. మొత్తానికి అయితే చాలా రోజుల తర్వాత సోషల్ మీడియాలో దర్శనమిచ్చిన నేహా శెట్టి.. ఇలా రెడ్ అవుట్ ఫిట్ లో సందడి చేసి అభిమానులలో చెమటలు పట్టించింది.

## సంయుక్త సాహసం!

**సరికొత్త పాత్రలో మెస్మరైజ్**

పవర్‌ఫుల్ పాత్రలో పరిచయం

ది బ్లాక్ గోల్డ్ పోస్టర్ లుక్స్ అదుర్స్



లక్కీ చార్మ్ సంయుక్త ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో తన సత్తా చాటుతోంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ది బ్లాక్ గోల్డ్' నుండి చిత్ర బృందం ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో సంయుక్త ఒక ఫియర్ లెస్, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నట్లు పోస్టర్ చూస్తుంటేనే అర్థమవుతోంది. 'ఆయుధాల కంటే న్యాయాన్ని నమ్మే మహిళ' అనే ట్యాగ్ లైన్‌తో ఈ పాత్రను పరిచయం చేశారు. పోస్టర్‌లో సంయుక్త లుక్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. యోగి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గతంలో 'బింబిసార', 'విరూపాక్ష' వంటి సినిమాలతో భారీ విజయాలు అందుకున్న సంయుక్త, ఇప్పుడు ఈ ప్రయోగాత్మక చిత్రంతో మరో హిట్ తన ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా ఇలాంటి పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ కథలను ఎంచుకుంటున్న సంయుక్తను చూసి అభిమానులు మురిసిపోతున్నారు.




## ఇస్మార్ట్ క్రేజ్!


- నభాకు అరుదైన గౌరవం
- షీ ఇండియా కవర్ పేజీపై ఫొటో

"షీ ఇండియా" అనే మ్యాగజైన్ కవర్ పేజ్.. బ్లాక్ అవుట్ ఫిట్ లో బాక్సింగ్ లుక్ లో ఉన్న నభా నటేష్ ఫొటోని తన కవర్ పేజ్ పై షేర్ చేస్తూ "నభా నటేష్ అన్ స్టాపబుల్" అంటూ ఆమెకు స్పెషల్ విషెస్ తెలియజేసింది.. ముఖ్యంగా ప్రపంచాన్నే ఇన్‌స్పైర్ చేస్తున్న ప్రతి ఒక్క మహిళకి ఉమెన్స్ డే శుభాకాంక్షలు అంటూ తన కవర్ పేజీపై నభా నటేష్ ఫొటోని షేర్ చేసింది షీ ఇండియా. ఇక ప్రస్తుతం షీ ఇండియా మ్యాగజైన్ కవర్ పేజీపై దర్శనం ఇచ్చిన నభా నటేష్ పై.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు లభించిన ఈ గౌరవానికి ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు ప్రస్తుతం ఈ ఫొటో అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. నన్ను దోచుకుందువటే అనే సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత రామ్ పోతినేని హీరోగా వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నిధి అగర్వాల్ తో కలిసి తన ఖాతాలో మంచి విజయాన్ని చేరవేసుకుంది . యాక్సిడెంట్ కారణంగానే రెండేళ్ల పాటు ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఆమె.. ఇప్పుడు రెండు విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నిఖిల్ స్వయంభు తో పాటు నాగబంధం అనే సినిమాలో నటిస్తోంది. రెండు చిత్రాలు కూడా విభిన్న జానర్ లు కావడం గమనార్హం. పైగా రెండు కూడా పాన్ ఇండియా లెవెల్ లో విడుదల కాబోతున్నాయి.




## సముద్రతీరంలో.. యోగాసనాలు

**హీట్ పుట్టిస్తున్న సాక్షి మాలిక్**



: ప్రముఖ మోడల్ కం నటి సాక్షి మాలిక్ సోషల్ మీడియాలో తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో మరోసారి సెన్సేషన్ సృష్టించింది. బీచ్ నేపథ్యంలో బికినీ ధరించి ఈ బ్యూటీ ఇచ్చిన స్టన్నింగ్ భంగిమలు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సముద్రపు అలల సాక్షిగా సాక్షి ప్రదర్శించిన అందచందాలు, ముగ్ధ మనోహర రూపం ఈ ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫిట్‌నెస్ విషయంలో ఈ ముంబై డాళ్ కి ఉన్న మక్కువ ఆ స్లిమ్ అండ్ టోన్డ్ బాడీలో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా సన్ సెట్ వెలుగులో సాక్షి గ్లామర్ మరింత రెట్టింపు అయ్యింది . సాక్షి మాలిక్ కేవలం అందంపైనే కాకుండా తన బల శిక్షణ, ఆత్మవిశ్వాసంపై కూడా దృష్టి సారిస్తుందని ఈ ఫొటోలు నిరూపిస్తున్నాయి.షి మూవ్స్ విత్ పర్పస్, షిమూవ్స్ విత్ స్ట్రెంగ్త్ అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ పోస్ట్ సాక్షిలోని దృఢత్వాన్ని చాటిచెబుతోంది. నీలిరంగు బికినీలో ఈ బ్యూటీ కనబరిచిన హొయలు, బీచ్ ఇసుకపై కెమెరాకు ఇచ్చిన ఫోజులు యూత్ లో సెగలు పుట్టిస్తున్నాయి. గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న సాక్షి ఈ సరికొత్త లుక్‌తో ట్రెండింగ్‌లో నిలుస్తోంది.

## స్లీవ్‌లెస్‌లో.. సోయగాలు

**అభిమానులకు రిద్ధి ట్రీట్**

సీజన్ కి తగ్గట్టుగా ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి అటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్నారు సెలబ్రిటీలు. ముఖ్యంగా అకౌంట్ ఉంటే చాలు తమ అందాలు ఆరబోస్తూ.. అటు దర్శక నిర్మాతల కంట్లో కూడా పడుతున్నారు. తాజాగా ప్రభాస్ బ్యూటీగా పేరు దక్కించుకున్న రిద్ధి కుమార్.. ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో మరింత వైరల్ గా మారుతున్నాయి. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ లెహంగా ధరించిన ఈమె.. ముత్యాలతో అద్భుతంగా రూపొందించిన ఈ డ్రెస్. తన మేనిఛాయతో అందాలు ఒలకబోస్తూ ప్రేక్షకులను మరింత మెస్మరైజ్ చేస్తోంది. ముఖ్యంగా నెక్ ను గ్రీన్ కలర్ స్టోన్ చైన్ తో ఫుల్ ఫిల్ చేసింది. మొత్తానికైతే రిద్ధి కుమార్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తోంది. తన అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ సమ్మర్ వేళ మరింత హీట్ పుట్టిస్తుంది అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



## ఆ మాటలపై.. ఆగ్రహం!

**పార్థిబన్‌కు త్రిష కౌంటర్**

- తప్పు తనదేనన్న సీనియర్ నటుడు
- త్రిషకు సారీ చెప్పిన పార్థిబన్

ప్రముఖ నటుడు ఆర్.పార్థిబన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు హీరోయిన్ త్రిష కౌంటర్ ఇచ్చింది.. మైక్రోఫోన్ చేతికి దొరికినంత మాత్రాన మాట్లాడే మాటల్లో తెలివి ఉండదని, అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుందని ఆమె చురకలంటించింది.

### అసలేం జరిగింది?

ఇటీవల జరిగిన గలాటా అవార్డ్స్ కార్యక్రమంలో గతంలో తను కలిసి పనిచేసిన నటీనటులపై అభిప్రాయం చెప్పాలని పార్థిబన్‌ను కోరారు. ఈ క్రమంలో తెరపై త్రిష ఫొటో కనిపించగానే, ఆయన ఆమె పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "ఈ కుందవైని కొన్ని రోజులు ఇంట్లోనే ఉంచాలి. బయటకు రాకుండా చూసుకోవాలి. అదే మంచిది" అన్నారు. ఇటీవల నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌తో కలిసి త్రిష ఒక వివాహ వేడుకలో కనిపించిన నేపథ్యంలో పార్థిబన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాగా, ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### ఘాటుగా స్పందించిన త్రిష

ఈ వివాదంపై త్రిష తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా గట్టిగా బదులిచ్చారు. "ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో ఒక వ్యక్తి తన అసిస్టెంట్ ద్వారా చెప్పించి చివరి నిమిషంలో నా పేరు, ఫొటో చేర్చారని ఆర్గనైజర్లు నాకు తెలిపారు" అని ఆమె వెల్లడించారు. "చేతిలో మైక్ ఉన్నంత మాత్రాన మాట్లాడే మాటలు తెలివైనవిగా లేదా హాస్యంగా ఉండవు. అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుంది. అవగాహన లేకుండా మాట్లాడే అసభ్యకరమైన మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారో వారి కంటే, మాట్లాడిన వ్యక్తి గురించే ఎక్కువ చెబుతాయి" అని ఆమె పోస్ట్ చేశారు. త్రిష స్పందనకు నెటిజన్ల నుంచి మద్దతు లభించింది.

### క్షమాపణ చెప్పిన పార్థిబన్

తన వ్యాఖ్యలపై వివాదం ముదరడంతో నటుడు పార్థిబన్ దిగివచ్చారు. తన ఎక్స్ ఖాతా ద్వారా క్షమాపణలు తెలిపారు. త్రిషను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. దీంతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగింది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197